విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 16, మార్చి 2025

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-అవుకు: రేపటి నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి శ్రీధర్ రావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 ప్రభుత్వ మరియు రెండు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని అన్నారు. మంగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు బనగానపల్లెలోని పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. అవుకు పట్టణంలో 12 పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థుల కోసం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. బాలల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు రాయనున్నారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. ఈనెల 17వ తేదీ నుండి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాంలో సౌకర్యాలు, ఏర్పాట్లను మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ కలాం, మండల అభివృద్ధి అధికారి ప్రసాద్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ప్రతి తరగతి గదిలో విద్యుత్, తాగునీరు, బెంచీలు తదితర వాటిని క్షుణంగా పరిశీలించారు. పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థులు పరీక్ష కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - చాగలమర్రి : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉం టుందని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జల్సాగౌస్ తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఐడికే శాస్త్రి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొలిమిగుండ్లకు రాక

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: రాష్ట్ర రహదారులు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండల కేంద్రమైన కొలిమిగుండ్ల కు నేడు విచ్చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ కేంద్రాన్ని మంత్రి బీసీ పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ అనంతరం మండలంలోని ఆయా గ్రామాలకు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధ జలం సరఫరా అవుతుందని తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

అట్టహాసంగా ప్రీ నర్సరీ ముగింపు వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణం ఎన్జీవో కాలనందుగల శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులకు ప్రీ నర్సరీ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ నర్సరీ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రీ నర్సరీ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల విచిత్ర వేషధారణలు, దేశ నాయకుల ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్ స్టోరీస్, నంబర్ గేమ్స్, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ఫ్యాషన్ షోలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఆడుతూ పాడుతూ ప్లే వే మెథడ్ లో యాక్టివిటీ బేస్డ్ విధానంలో పిపిటి టీచర్స్ ట్రైనింగ్ సంరక్షణలో విద్యార్థులకు చక్కని శిక్షణ అందించినట్లు డైరెక్టర్ తెలిపారు. స్కూల్ గౌరవ సలహాదారులు సింధు, రేవతి అతిథులుగా విచ్చేసి ప్రతిభ కనబరచిన చిన్నారులకు బహు మతులను అందజేశారు. విద్యార్థుల ప్రతిభ పాటలను అభినందించారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

విశాలాంధ్ర - పాములపాడు : తెలుగు గంగ కాలువకు ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన గుండాలన్నట్టు గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు గుండాలనట్టు గ్రామానికి చెందిన ఆనందరావు కుమారుడు అమూల్య రాజు (13) అమూల్య రాజు బాలకచెర్ల పాఠశాల యందు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శనివారం నుండి ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నం గ్రామానికి సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువలో ఈత పడేందుకు వెళ్లి, అపస్మార మృతికి వెళ్ళిపోయాడు. తల్లిదండ్రులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆనందరావు, కళ్యాణి దంపతులకు ముగ్గురు కుమారులు. మృతి చెందిన అమూల్య రాజు పెద్ద కుమారుడు. పెద్ద కుమారుడు చనిపోవడంతో కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై పాములపాడు ఎస్సై సురేష్ బాబు విచారణ చేపట్టారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, డోన్

HMOP No. 3/2025

పిటిషనర్............... కమ్మరి రాధిక అలియాస్ లావణ్య

V/s

రెస్పాండెంట్........... వడ్ల వీరే ష్ ఆచారి S/o లేట్ శ్రీనివాసులు ఆచారి, వయస్సు 26 సంవత్సరములు, ఇంటి నెంబర్ 4/193, పడమర బీసీ కాలనీ, గూడూరు గ్రామం గూడూరు మండలం కర్నూలు జిల్లా.

నోటీస్

పైన తెలిపిన HMOPలో రెస్పాండెంట్ అయిన మీపై పిటిషనర్ పై కోర్టులో విడాకుల కొరకు కేసు వేసి ఉన్నారు తేదీ 28/03/2025న హాజరవుటకు కోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు. కావున పై తేదీన మీరు ఉదయం 10 గంటలకు మీరు కానీ, ఎవరైనా వకీలు ద్వారా కానీ హాజరై ఏవైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టు వారు మీ పరోక్షమున పై కేసును తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

వాయిదా తేదీ 28/03/2025
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
LV ప్రసాద్
జె.రవి మోహన్
శ్రీమతి మీనిగ కుమారి
పిటీషనర్ తరపు న్యాయవాదులు
డోన్

స్వచ్ఛతలో నంద్యాలని అగ్రస్థానంలో నిలుపుదాం : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాలని పరిశుభ్ర నంద్యాల పట్టణంగా తీర్చిదిద్దుదామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నెలలో మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని అందులో భాగంగా శనివారం నంద్యాల పట్టణం నందమూరి నగర్ పోయే దారిలో ఉన్న తొయ్యిబా ఈద్గాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్య క్రమానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్ జి.రాజ కుమార్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డిఎస్పి మందా జావలి అలఫోన్స్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమంలో భాగంగా పట్టణంలో తొయ్యిబా ఈద్గాలో చెట్లు నాటడం జరిగింది. నంద్యాల పట్టణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించి, స్వచ్ఛాంధ్ర కల సాకారం చేసుకోవడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. నంద్యాలను అత్యంత పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం వంటి వాటిని పడేయ వద్దని, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం అమలు చేస్తోందని వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యమంలో నంద్యాల పట్టణ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ సిబ్బంది, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు ప్రత్యామ్నాయం సిద్ధం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన నివారణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో వేసవి తీవ్రత దృష్ట్యా రూరల్, అర్బన్ ప్రాంతాల్లో సరఫరా చేయాల్సిన త్రాగునీటి సరఫరాపై ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొ ట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డిఆర్ఓ రాము నాయక్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించడానికి, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడటానికి ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట ప్రణాళిక రూపొందించు కొని తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి కారణంగా ప్రస్తుతం భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్న క్రమంలో వచ్చే వర్షాకాలం సీజన్ వరకు ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జొన్న రైతులను ప్రభుత్వము ఆదుకోవాలి

విశాలాంధ్ర - వెలుగోడు : ఆరుగాలము కష్టించి జొన్న పంట పండిస్తే, పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోతే ఆ రైతు బాధ వర్ణనాతీతం. జొన్న పండించిన రైతులు పంటను అమ్ముకోలేక ఏమి చేయాలో తెలియక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జొన్నలు పండించిన రైతులు పండించిన పంటను దాచుకోలేక ఇంట్లోనే ఉంచుకోలేక, తక్కువ రేటుకు దళారులకు అమ్ముకో లేక అష్ట కష్టాలు పడుతున్నారు. జొన్న రైతులకు ప్రతి ఏడాది కొనుగోళ్ల కేంద్రాలను ప్రభుత్వము ఏర్పాటు చేసి మంచి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. కానీ కొనుగోలు కేంద్రాలను ఇంతవరకు ప్రభుత్వము ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దిగాలు పడిపోతున్నారు. నంద్యాల జిల్లాలో జొన్న పంటను రైతులు 24,940 హెక్టార్లు సాగు చేసినట్లు ప్రభుత్వ అధికారుల ద్వారా తెలుస్తుంది. వెలుగోడు మండలంలోని వేల్పనూరు, రేగడ గూడూరు గ్రామాలలో 3,500 ఎకరాలలో జొన్న పంటను సాగు చేశారు. ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతులు సంతోషపడుతుండగా, సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు దిగాలు చెందుతున్నాడు. ప్రజా ప్రతినిధుల నుంచి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ శాఖ కమిషనర్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ప్రతిపాదనలు అందాయి. కానీ ప్రభుత్వము ఇంతవరకు ఎలాంటి నిర్ణయము తీసుకోక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. దీనికి ప్రధాన కారణం రైతుల నుంచి కొను గోలు చేసిన పంటను నిల్వ చేయడానికి అనువైన గోడౌన్లు లేకపోవడమే. ప్రభుత్వ గోడౌన్లు, సివిల్ సప్లై గోడౌన్లు కానీ ఖాళీగా లేనందు వల్ల ఈ పరిస్థితి దాపు రించినట్లు తెలుస్తుంది. ఏపీ ఆగ్రోస్ సంస్థ ద్వారా జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుం టుందని పలువురు నాయకులు ప్రభుత్వానికి సూచిస్తు న్నారు. రాయలసీమలోనే జొన్న రొట్టెలు ప్రజలు ఆహారంగా ఉపయోగిస్తు న్నారు గత ఏడాది కొన్న జొన్నలే ఇప్పటికి గోడౌన్ల లో ఉన్నాయని, అందువల్ల ప్రభుత్వం కొనుగోలు కు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. ఏది ఏమైనా ప్రభుత్వం రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కంది పంటకు సరైన గిట్టుబాటు ధర లేదు. గత ఏడాది క్వింటా రూ.7 వేలు ఉండగా, ఈ ఏడాది క్వింట రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారు. మిరప ను క్వింటా పన్నెండు వేల రూపాయలు కొనుగోలు చేస్తున్నారు. మినుము పంటను గత ఏడాది రూ.8300 కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.7500 ధర మాత్రమే పలుకుతుంది. మొక్కజొన్న పంటకు మాత్రమే, దిగుబడి బాగుండి, గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉన్నందువల్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

18న సామాజిక బహిరంగ సభ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఈ నెల 1న ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి శనివారం తెలిపారు. ఆయా గ్రామాలలో ఏప్రిల్ 1, 2023 నుండి మార్చి 31, 2024 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఉపాధి పనులపై బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈనెల మూడో తేదీ నుండి 14వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం సిబ్బంది ఆయా గ్రామాలలో ఉపాధి పనులను తనిఖీ చేశారని తెలిపారు. ఉపాధి పనులు, పంచాయతీరాజ్, సర్వ శిక్ష అభియాన్, పశు సంవర్ధక శాఖ క్రింద చేపట్టిన పనులపై సభ ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు హాజరు కావచ్చని తెలిపారు.

తెలుగు గంగ కాలువకు గండి

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి సమీపంలో ఉన్న తెలుగుగంగ 17వ బ్లాకు ఉపకాల్వకు గండి పడి నీరంతా పంట పొలాల్లోకి పారుతుందని రైతులు తెలిపారు. శనివారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరంగాపురం గ్రామానికి సమీపంలో ఉన్న 17వ బ్లాకు కాల్వకు తెలుగు గంగ నీరు పారుతుంది. దీంతో ఉపకాలువ క్రింద రైతులు వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు. గతంలో 17వ బ్లాకు ఉపకాల్వకు గండిపడి నీరంతా వృధాగా పంటల పొలాల్లోకి పారిన విషయాన్ని సంబంధిత అధికారులకు రైతులు తెలియజేసినప్పటికి స్పందించకపోవడంతో రైతులందరూ కలిసి తాత్కాలికంగా గండిని కూర్చున్నారు. ఈ ఏడాది ఇదే ప్రాంతంలో గండిపడి సాగునీరంత పంట పొలాల మీదకు పారుతుందని రైతులు అదేకారులకు తెలియజేసినప్పటికీ ఇంతవరకు స్పందించలేదని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గడ్డిని పూడ్చి వేయాలని రైతుల కోరుతున్నారు.

ప్రజల సహకారంతోనే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రజల సంపూర్ణ సహకారంతోనే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర వంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయగలమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బనగానపల్లెలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక తాహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణ ప్రజలు, విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మానవ హారంగా నిలబడ్డారు. అనంతరం మంత్రి వారితో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. బీసీ జనార్ధన్ మాట్లాడుతూ మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారంను స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం జరుపుకోవడం జరుగు తోందన్నారు. తాహాశీల్దార్ బి.నారాయణ రెడ్డి, ఎంపీ డీవో వెంకటరమణ, పంచాయతీరాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన గుప్తా, ఏఈ సాయి కృష్ణ, ఈఓఆర్డి బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులు, ఏపీవో రేష్మ, మండల విద్యాధికారి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

విశాలాంధ్ర-డోన్ : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి వినతులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ముఖ్య లక్ష్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని హితవు పలికారు. మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు బత్తిన ముని స్వామి, మేఘ వర్ధుడు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేసుడిని దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం క్షేత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం దర్శించుకుని లక్ష్మీ నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దిగువ అహోబిలంలోని ఆలయానికి చేరుకున్న విజయానంద్ కి ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రహ్లాద వరదస్వామి వారికి అష్టోత్తర పూజలు, అమృతవల్లి అమ్మవారికి కుంకుమార్చన పూజలను నిర్వహించారు. అనంతరం సిఎస్ ను ఆలయంలోని రంగ మండపంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ వేద ఆశీర్వాదం చేసారు. ఈ సందర్భంగా సిఎస్‌కి నవ నరసింహ క్షేత్రాల చిత్రపటాన్ని ప్రధాన అర్చకులు ఇచ్చారు. టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి విజయానంద్‌కు శిల్పాన్ని బహుకరించారు. అనంతరం అహోబిలం మఠంలో 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి వారిని విజయానంద్ దర్శించి, ఆశీర్వాదం పొందారు. స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గునియా, డీఎస్పీ ప్రమోద్ కుమార్, టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ బలిజ సత్రం అధ్యక్షులు శెట్టి విజయకుమార్, గూడూరు సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం.. స్వచ్ఛ ఆంధ్రాను సాధిద్దాం

విశాలాంధ్ర-పాణ్యం: మానవ మనుగడకు హానికారకమైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి స్వచ్ఛ ఆంధ్రను సాధిద్దామని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కౌలూరు గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, జిల్లా ఇన్చార్జి సీనియర్ ఐఏఎస్ అధికారి నివాస్,జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అధికారులు,ప్రజలచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.అనంతరం వారు సచివాలయ ఆవరణలో ఉన్న చెత్త చెదారాన్ని శుభ్రం చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ తమ చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని అన్నారు.క్యాన్సర్ కారకమైన ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలికి,మానవ మనుగడకు పర్యావరణానికి మేలు చేసే జూట్ సంబంధిత వస్తువులను వాడాలని పిలుపునీయడం జరిగింది. సేంద్రీయ వ్యవసాయం ప్రకృతి వ్యవసాయ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని పంటలను పండించాలన్నారు. అనంతరం వారు చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించి, నూతన నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది.ఇందిరా చెంచు కాలనీలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గిరిజనులకు ఉగాది పండుగను పురస్కరించుకొని ముందస్తుగా తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వారికి అందజేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి,ఏపిఎం ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ మహబూబ్ బాష, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట ఉన్నత పాఠశాలలో స్వర్ణ ఆంధ్ర..

విశాలాంధ్ర - నందికొట్కూరు : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయులు సలీం భాష అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణంలోని స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోటా నందు ఆదివారం నిర్వహించారు. ముందుగా ఉదయం ప్రార్థన సమయంలో బయోలాజికల్ సైన్సు ఉపాధ్యాయుడు మల్లికార్జున రెడ్డి విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర - కొత్తపల్లి: టాటా మ్యాక్సీ, బైకు ఎదురెదురుగా ఢీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికీ గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన కొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎర్ర మఠం గ్రామానికి చెందిన జొల్లు బాల లక్ష్మయ్య తన బైక్‌పై తన భార్య అయిన సరస్వతిని సంగమేశ్వరం నుంచి ఎక్కించుకొని వస్తుండగా పాత మాదుగుల కపిలేశ్వరం గ్రామాల మధ్యలో ఉన్న ధనుషాల లింగమయ్య సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న టాటా మ్యాక్సీ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న జొల్లు బాల లక్ష్మయ్య, అతని భార్య సరస్వతికి గాయాలయ్యాయి. ప్రమాదం గమనించిన పలువురు 108^ు సమాచారం తెలుపగా, హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాల లక్ష్మయ్యను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగిసిన ఇంటరు పరీక్షలు

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలో ఇంటరు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. చివరి రోజు ఇంటరు ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ పరీక్షతో ముగిసింది. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్షా హాలు బయటకు వచ్చి కేరింతలేశారు.

వేసవి దృష్ట్యా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - బనగానపల్లి: వేసవికాలం రోజురోజుకు పెరుగుతున్న ఎండల దృష్ట్యా చిరు వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. శనివారం నాడు పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్లో గల చిరు వ్యాపారులను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కలిశారు. తోపుడు బండిపై విక్రయిస్తున్న మజ్జిగను మంత్రి కార్యకర్తలతో కలిసి మజ్జిగను సేవించారు. ఈ సందర్భంగా బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిరు వ్యాపారులకు అండగా ఉంటుందని తెలిపారు. చిరు వ్యాపారులు మంత్రి చూపిన ప్రేమకు ఆప్యాయతకు సంతోషం వ్యక్తం చేశారు.

సోముల లోకేష్ రెడ్డిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్లలో వైసీపీ నాయకుడు మాజీ సర్పంచ్ సోముల లోకేష్ రెడ్డిపై హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను కోవెలకుంట్ల పోలీసులు అరెస్టు శనివారం చేశారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి ని త్వరలో పట్టుకుంటామని ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ మీడియాకు తెలిపారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల లో ఈనెల 12వ తారీఖు రాత్రి 10 గంటల సమయంలో వైసీపీ నాయకుడు సోముల లోకేష్ రెడ్డి ఇంటిపై అదే గ్రామానికి చెందిన పత్యర్థులు కర్రలు, ఇనుపరాడ్లు తో దాడి చేసి బీభత్సం సృష్టించారు. అడ్డొచ్చిన లోకేష్ తండ్రి వెంకటరామి రెడ్డి, తమ్ముడు వెంకటేశ్వర్ రెడ్డిలపై దాడికి పాల్పడ్డారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోని విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. తన ఇంటిపై దాడి విషయం తెలుసుకున్న సోముల లోకేష్ రెడ్డి ఇంటి వద్దకు రాగా పత్యర్థులు లోకేష్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. ప్రాణ భయంతో పొలాల్లోకి పరిగెత్తిన లోకేష్ రెడ్డి నీ వెంబడించి ఇనుప రాడ్లు, వేట కొడవళ్ళు తో దాడికి పాల్పడ్డారు. అప్పటికే గ్రామస్తులు డయల్ 112కు కాల్ చేయగా సమాచారం అందుకున్న కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున్ రెడ్డి తన సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. పోలీస్ వాహనం సైరన్ విన్న నిందితులు సంఘటన స్థలం నుండి పరారయ్యారు. తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో ఉన్న లోకేష్ రెడ్డిని పోలీసులు హుటాహుటిన కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం లోకేష్ రెడ్డిని నంద్యాలకు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న లోకేష్ రెడ్డికి వైద్యులు వెంటి లెటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో లోకేష్ రెడ్డి తమ్ముడు వెంకటేశ్వర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంపమల్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు సూర చిన్న సుబ్బారెడ్డి తో పాటు 9 మందిపై కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ డిఎస్‌పి ప్రమోద్ ఆధ్వర్యంలో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారిలో ఉన్న మరో ముగ్గురు నిందితులను త్వరలో పట్టుకుంటామని ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ తెలిపారు. సీఐ హనుమంతు నాయక్, ఎస్సై మల్లికార్జున్ రెడ్డి, పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.

అక్రమణలను సహించం

విశాలాంధ్ర - డోన్ రూరల్: ఎట్టి పరిస్థితులలో అక్రమంగా ఆక్రమించిన స్థలాలను ఉపేక్షించామని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కోట్ల మాట్లాడుతూ సర్వే నంబర్ 394లో కొంత మంది దేవాలయం పేరిట స్థలాన్ని ఆక్రమించు కున్నారని, అందుకే ఆ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను శనివారం కూలగొట్టినట్లు ఆయన తెలిపారు. ఆ స్థలం కేంద్రీయ విద్యాలయం కొరకు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అక్రమణదారులు ఎంతటి స్థాయికి చెందిన వారైనా ఏ పార్టీ వారైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డోన్ అభివృద్ధి కొరకు ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లది రూపాయలతో త్వరలో పనులు చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో....

నగరపాలక మొండి బకాయిలపై ఉక్కుపాదం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరపాలక సంస్థకు దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జీ.వి. కృష్ణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్వోలు, రెవెన్యూ ఇంస్పెక్టర్లు, ప్రత్యేక అధికారులు, ఏఈలు, అడ్మిన్, ఎమినిటీస్ కార్యదర్శులతో పన్ను వసూళ్లపై సమీక్షించారు. అంతకన్నా ముందు నగరపాలక కార్యాలయంలోని పన్ను వసూళ్ళ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి పన్నులు ఎంతో కీలకమైనవని, అవి లేకపోతే నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించడం అసాధ్యమన్నారు. ఆస్తి పన్ను చెల్లింపునకు ఎటువంటి గడువు, రాయితీ లేదని, తక్షణమే గృహ యజమానులు, వాణిజ్య దుకాణాల వ్యాపారస్తులు పన్నులను చెల్లించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే మొండి బకాయి దుకాణాలను సీజ్ చేశామని, 64 తాగునీటి కొళాయి కనెక్షన్లను కట్ చేశామని తెలిపారు. ప్రజలను ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశ్యం కాదని, ప్రజల కోసమే తమ తపన అని స్పష్టం చేశారు. ఆస్తి పన్నులు 58.41 శాతం, కొళాయి చార్జీలు 25.98 శాతం వసూళ్ళు పూర్తి అయిందని వెల్లడించారు. నగర ప్రజలు సత్వరమే పన్నులు చెల్లించి, నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని అదనపు కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆర్వో జునైద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా ఇన్చార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అన్నారు. సమర్థవంతమైన పరిపాలనను అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను డిస్ట్రిక్ట్ ఇన్చార్జ్ ఆఫీసర్లుగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి ఐఏఎస్ అధికారులను జోనల్ ఇన్చార్జ్ ఆఫీసర్లుగా నియమించింది. ఇందులో భాగంగా జిల్లా ఇన్చార్జి అధికారిగా నియమితులైన రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపడుతున్న ఫ్లాగ్ షిప్ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, డ్వామా, డిఆర్‌డిఏ జలవనరులు, వైద్యారోగ్యం, విద్యా శాఖలకు సంబంధించిన కార్యక్రమాల అమలు గురించి ఆయా శాఖల జిల్లా అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి డిస్ట్రిక్ట్ ఇన్చార్జ్ ఆఫీసర్లు, జోనల్ ఇన్చార్జ్ ఆఫీసర్లుగా నియమించారన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడానికి వీలుగా జిల్లా కలెక్టర్ కు తగిన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రభుత్వం ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు.. నిన్ననే జిల్లా అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, వనరుల సమీకరణ అంశాలపై జిల్లా కలెక్టర్ తో చర్చించడం జరిగిందని ఆయన తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు అభినందనలు: విద్యా శాఖకు సంబంధించి వర్చువల్ తరగతుల నిర్వహణ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయులతో 500 పాఠశాలల విద్యార్థులకు విద్యా బోధన అందిస్తూ, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ను అధిగమించడంపై జిల్లా కలెక్టర్ తీసుకున్న ప్రత్యేక చొరవ ను ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించారు. టెక్నాలజీ అమలులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ముందుంటారని, గతంలో కడపలో పని చేసే సమయంలో భూ రికార్డుల కంప్యూటరీకరణలో వారి పాత్ర ప్రశంసనీయమని ప్రిన్సిపల్ సెక్రటరీ అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - సి.బెళగల్: సోమవారం ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తహసిల్దార్ పురుషోత్తం పరిశీలించారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తహశీల్దార్ పురుషోత్తం ఎస్సై ఎం.తిమ్మారెడ్డితో కలిసి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సరైన వసతులు కల్పించాలని, వసతులపై ఆరా తీసి, ఆయన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ మోహన కు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసిల్దార్ సూచించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర- గూడూరు: గూడూరు నగర పంచాయతీ లోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను స్థానిక కోఆప్షన్ సభ్యులు పుట్టపాశం రామాంజనేయులు, ఏడో వార్డు కౌన్సిలర్ ఎం.రత్నమ్మ అందజేశారు. శనివారం హైస్కూల్ హెచ్ఎం సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన పరీక్ష పాడ్ల పంపిణీ కార్యక్రమంలో కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కోఆప్షన్ సభ్యులు పుట్టపాశం రామాంజనేయులు మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని, విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. పదవ తరగతితోనే భవిష్యత్తుకు తొలి మెట్టని అన్నారు. 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీరిత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరశురాముడు, టిడిపి నేతలు బాబు, పి.కృష్ణ వీరేశ, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో ఈ శనివారం డివీస్ లాబోరెటరీస్, హైదరాబాదు వారిచే ఫార్మా ప్రాంగణ ఎంపికలు నిర్వహించబడ్డాయి. ఇందులో భాగంగా బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బి.టెక్ మెకానికల్‌లో విద్యార్థులు 126 మంది పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థులకు పరీక్ష పద్ధతి మరియు ఇంటర్వ్యూ ద్వార 62 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు- డివిస్ లేబరేటరీస్ కి సంబంధించిన హెచ్ఆ లు కె హరి క్రిష్ణ మరియు కె.శివ నవీన్‌లు ప్రతిభ కనపరిచిన విద్యార్థు లందిరికి ఉద్యోగ అవకాశం ఇచ్చామన్నారు. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులను కళాశాల చైర్మెన్ డాక్టర్ కె.వి.సబ్బారెడ్డి, కరెస్పాండెంట్ కె.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ బి.వి.రచణ, ప్లేస్ మెంట్ ఇంచార్జ్ డా.నిజాముద్దీన్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర. సి బెళగల్: కోడుమూరు పట్టణంలో ఈ నెల 22న జరిగే రజకుల జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని రజకుల వృత్తి దారులు సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో జిల్లా కార్యదర్శి సభ్యులు బాలచంద్రుడు, మల్లికార్జున ల సమక్షంలో మండల నాయకుల చేత కరపత్రాలను విడుదలచేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గురు శేఖర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 ఏళ్ళు పూర్తయినా రజకులు ఆర్థికంగా, రాజకీయంగాఎదగకుండా అణచివేస్తున్నారని వృత్తి లేక వలసలు వెళ్తున్నారని ఒక వేళ వృత్తి ఉన్నా 50 ఏళ్లకే వయసు భారం మీద పడి ఏమి చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 22 న కోడుమూరులో జరిగే రజక మహా సభలకు పెద్ద ఎత్తున హాజరై హక్కులపై ఉద్యమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, వీరేష్, వెంకటేష్, మల్లెన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

పిల్లల నైపుణ్యాలు పరిశీలించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పెంపొందించడం కమ్యూనికేషన్, ప్రదర్శన నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చెందడానికి విద్యార్థి నేతృత్వంలోని సమావేశాలు ఉపయోగపడతాయని స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్ భాష తెలిపారు. స్థానిక మాధవ్ నగర్ లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో స్టూడెంట్ లీడ్ ప్రోగ్రాం (ఎస్ఎల్‌సి) శనివారం ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి క్లస్టర్ ప్రిన్సిపల్ ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఎల్‌సి ప్రదర్శనను పరిశీలించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులుగా మారి, తమకు నచ్చిన అంశంపై ఒక భావనను చిన్న ప్రదర్శన ద్వారా మూడు రోజులుగా జరగడం విశేషమన్నారు. పిల్లల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు గమనించి ఆచరణలో పెట్టిన వాటిని అభ్యాసన రూపంలో చురుకుగా పాల్గొనే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని తమకు నచ్చిన రీతిలో ప్రదర్శించే విధంగా నారాయణ విద్యాసంస్థలు చిన్నారులను ప్రోత్సహిస్తాయన్నారు. కార్యక్రమంలో ఈ కిడ్స్ కోఆర్డినేటర్ అరుణ, వైస్ ప్రిన్సిపల్ రాధ పాల్గొన్నారు.

చీఫ్ సెక్రటరిని కలిసిన ఎస్.కృష్ణయ్య

విశాలాంధ్ర- బళ్లారి చౌరస్తా : స్వచ్ఛా ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో 1104 రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పూలబుకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్ శాఖ లో వున్నా సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు ఎస్.కృష్ణయ్య తెలిపారు. త్వరలో నే మీటింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేశ్వర్ రెడ్డి,నంద్యాల డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గంటల్లోపు పని ప్రదేశంలో ఉండాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే ప్రతి ఉపాధి కూలీ ఉదయం 6 గంటలకల్లా పని ప్రదేశంలో ఉండాలని ఈ పీవో రామన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో ఏపీవో రామన్న ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న పని ప్రదేశంలో ఆయన ఉపాధి పనులను పరిశీలించి, అనంతరం ఏపీవో రామన్న ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఎండాకాలం తీవ్రత పెరుగుతున్నందున ఉపాధి పనులకు వచ్చే ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకల్లా పని ప్రదేశంలో ఉండి ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రతి ఒక్కరూ రూ.300 కూలీలు పొందవచ్చని ఆయన సూచించారు. ఈపిఓ రామన్నతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు మేటీలు తదితరులు పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ చేయని పంచాయతీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఇంటి పన్ను చెల్లిస్తేనే చెత్త బుట్టలు ఇస్తామని లేకపోతే ఇవ్వమని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని జాలవాడి గ్రామ అధ్యక్షులు ముక్కన్న ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం చెత్త చెదారాన్ని తొలగించేందుకు కృషి చేస్తుంటే గ్రామ పంచాయతీ మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. దీనికి ఈఓఆర్డి వత్తాసు పలకడం దారుణమన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ప్రతి ఒక్కరికి చెత్త బుట్టలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర- కోడుమూరు : ఈ నెల 17వ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ-2 తైమూర్ బాష తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక జీవిఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంఈఓ తైమూర్ భాష,చీఫ్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జీవిఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 297 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఏ,బి సెంటర్లుగా చేయగా ఎ-సెంటర్ లో 240మంది,బి-సెంటం లో 200 మంది విద్యార్థుల తోపాటు ఏపీ మోడల్ స్కూల్ సెంటర్లో 286 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

సిద్దార్థ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర - హొళగుంద: సిద్దార్థ పాఠశాల విద్యార్థులుశనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌స్వచ్ఛ దినోత్సవ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెడ్మాస్టర్ చిదానంద ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి నినాదాలు ఇస్తూ పలకాలపై పర్యావరణ కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. హెడ్మాస్టర్ చిదానంద మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పైఅవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందిని ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రజలకు చాలా అనర్థాలు కలుగుతాయనిఅందువల్లప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్లాస్టిక్ ద్వారా మనసులకేకాక మొత్తం జీవ రాశులకు పర్యావరణానికి ముప్పు అని,ప్రజలందరూ జాగ్రత్త వహించాలని కోరారు. రాయల్ రిఫ, నేతాజీ, మదర్ తెరిసా, బాపూజీ,రివ పాఠశాలల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ స్తంభం ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : కరెంటు స్తంభం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సాయికుమార్ (25) సన్నాఫ్ శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై ఉప్పలపాడు వైపు నుంచి ఉయ్యాలవాడకి వస్తుండగా కరెంటు స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతి చెందిన యువకుడికి ఇంకా వివాహం కాలేదు మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యత

విశాలాంధ్ర - నందవరం: రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్యం మెరుగుపరడాలన్న ఉద్దేశంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమము ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ జరిగి వర్మి కంపోస్టును తయారుచేసి సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్స్ వాడకం నిరోధించే ఉద్దేశంతో శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించే ఉద్దేశంతో సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధముపై గ్రామ సభలు నిర్వహించి, ర్యాలీలు నిర్వహించి మానవహారాలు ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ నిషేధం లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై.పుల్లయ్య, తహశీల్దారు శ్రీనివాసులు, విస్తరణ అధికారి వి.సందీప్, మండల విద్యాశాఖ అధికారి రఘునాథ్, ఏపిఎం రాఘవేంద్ర, స్కూలు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు ఆయా శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఆదిపత్యపోరుతో దారుణ హత్య

టీడీపీకి చెందిన సంజన్న మృతి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆదిపత్యపోరులో మాజీ కార్పొరేటర్,టీడీపీ నేత సంజన్న (58) దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నగరంలోని శరీర్ నగర్‌కు చెందిన కార్పొరేటర్ బలరాంకు స్వయన తండ్రి. శుక్రవారం రాత్రి 9.20సమయంలో సంజన్న శరీర్‌నగర్‌లోని అల్లీపీర స్వామి మందిరం దగ్గరకు పోయి వస్తుండగా ప్రత్యర్థులు కాపుకాచి వేటకొడవళ్ళు, గొడ్డళ్ళు, రాడ్ లతో దాడి చేసి హత్య చేశారు. సంజన్నపై దాడి జరు గుతున్న విషయం తెలుసుకుని మృతుని వర్గీయులు అక్కడికి చేరుకునే సమయంలోనే నిందితులు అక్కడి నుండి పారిపోతూ అడ్డువచ్చిన కొంత మందిపై దాడి కి ప్రయత్నం చేశారు. మృతుడు సంజన్న మొదట సీపీఐ(ఎం)లో పనిచేశారు. అయన బార్య లక్ష్మీ శరీర్ నగర్ కార్పొరేటర్‌గాపని చేశారు. అనంతరం ఆయన కాటసాని వర్గంలో చేరారు. ఇటీవల జరిగిన కర్నూలు కార్పొరేషన్ ఎన్నికలలో మృతుని కుమారుడు బలరాం కార్పొరేటర్‌గా విజయం సాధించారు. సంజన్నకు శరీర్‌నగర్‌లో ప్రజాదరణ కలిగిన నేతగా గుర్తింపు ఉంది. 2024 ఎన్నికల సమయంలో సంజన్న టీడీ పీలో చేరి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అనుచరుడుగా గుర్తింపు పొందారు. బైరెడ్డి సిద్దార్థరెడ్డికి అనుచరుడు సాయి ఈశ్వరుడు హత్యలకేసులో నిందితుడుగా ఉన్న వడ్డె రామాంజనేయులుకు సంజన్న మధ్య బేదాభి ప్రాయా లు ఉన్నాయి. సాయి ఈశ్వరుడు కేసును ఇటీవలనే కోర్టు కొట్టి వేసింది. వడ్డె రామాంజ నేయులు అలియాస్ అంజితోపాటు సుమారు 15 నుండి 20 మంది ఈదాడికి పాల్పడినట్లు మృతుని కుమారుడు బలరాం ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోర్టు మర్టం నిమిత్తం కర్నూలు సర్వజన వైద్యశాలలకు తరలించారు.శరీర్‌నగరంలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని ఎస్పీ ఆదేశాల మేరకు పికెటింగ్ ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలంను జిల్లా ఎస్పీ పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సంజన్న మృతి బాధాకరమని ఎంపీ బాధాకరమని దారుణమని సంజన్న హత్య చేయడం దారుణమన్నారు. ఒకరిని చంపుతే ఏమి రాదని చంపుకోవద్దని,సమస్య వస్తే పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని శబరి కంట తడిపెట్టు కున్నారు. హత్య చేసిన నింది తులను వది లేదని లేదన్నారు. సంజన్న కుటుం బానికి నేను అండగా ఉంటానని తెలిపారు. సంజన్న మృతి విషయం తెలుసుకున్న టీడీపీ నేతల గౌరు వెంకట రెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు మార్చురి వద్ద సంజన్నకుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగుయువత నాయకులు ప్రభాకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

శరీర్‌నగర్‌లో ఉద్రిక్తం పరిస్థితి : నిత్యం అందు బాటుటో ఉండే నేతగా గుర్తింపు ఉన్న సంజన్న హత్యలో శరీర్‌నగర్ ఒక్కసారిగా ఉలిక్కి పండింది. సంజన్న హత్య విషయంతెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతున్ని పోస్టుమర్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలి ంచారు. శని వారం అంత్య క్రియలు జరిగే అవకాశం ఉంది. ప్రదాన నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం వల్లే గ్రామాభివృద్ధి

విశాలాంధ్ర - హొళగుంద: కూటమి ప్రభుత్వం వల్లే గ్రామాభివృద్ధి జరుగుతుందని టిడిపి నాయకుడు బిడగ జంగాల రామాంజనేయులు అన్నారు. జంగాల కాలనీలో రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులను శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. టిడిపి నాయకుడు బిడగ జంగాల రామాంజనేయులు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బి వీరభద్ర గౌడ్ సహకారంతో జంగాల కాలనీలో సిసి రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి రోడ్లు లేక గుంతలరోడ్డులో నడిచామని వర్షాకాలంలో చిత్తడి, బురదలో నడిచి కాలం గడిపామని అన్నారు. అందరి సహకారంతో కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంద ని టిడిపి, జనసేన, బిజెపి పార్టీ కూటమి ప్రభుత్వం లో అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ, పనులు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈ యమునప్ప ,టిడిపి నాయకులు రామయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీని విడుదల చేసిన వైద్య బృందం

విశాలాంధ్ర - కర్నూలు : ప్రతి ఒక్కరూ తమ మూత్ర పిండాలు ఎలా పనిచేస్తున్నాయి అన్న విషయం తెలుసుకునేందుకు వీలుగా జెమ్ కేర్ కామినేని వైద్యశాలలో రూ.3,180 విలువ గల చికిత్సలను కేవలం రూ.499 లకే అందిస్తున్నట్లు వైద్య బృందం అన్నారు. ప్రపంచ మూత్రపిండ దినోత్సవ వేడుకలు బాధితులతో కలసి వైద్యశాల ప్రాంగణంలో కేక్ కట్ చేసి ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవి కుమార్ మహంకాళి హాజరయ్యారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సతీష్ కుమార్ తో కలిసి ఆయన మూత్ర పిండాల చికిత్స తగ్గింపు ధరలతో కూడిన ప్యాకేజీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెమ్ కేర్ కామినేని ఎండి,సీఈవో డాక్టర్ చంద్రశేఖర్, డైరెక్టర్ డా. రవిబాబు (ఆర్థోపెడిక్), అత్యవసర విభాగాధిపతి డాక్టర్ రామమోహన్, యూరాలజిస్ట్ డాక్టర్ నిశాంత్, సీఈఓ డాక్టర్ గణేష్,వైద్యులు డాక్టర్ కృష్ణ (ఏజీఎం), జిఎం ఆపరేషన్స్ నదీమ్, డీజీఎం మార్కెటింగ్ రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మహంకాళి మాట్లాడుతూ ఇటీవల కాలంలో మూత్రపిండ బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ మూత్రపిండాలను పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా కేవలం రూ.499 లకే ప్రత్యేక ప్యాకేజీ ఈనెల 24 వరకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు.

మండల వ్యాప్తంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర -గూడూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు నిర్వహించి పరిసరాల్లో పారిశుద్య పనులు చేయించారు. శనివారం మండలంలోని పెంచికలపాడు గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో శివ నాగ ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు జే సురేష్ హాజరై స్వచ్ఛతపై ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో మానవుడు ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. సేకరించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించి సంపద సృష్టించేందుకు గ్రామ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ మద్దిలేటి, ఈఓఆర్‌డి మధులత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సనా, పంచాయతీ కార్యదర్శి ఎలిజిబెత్, టిడిపి నాయకులు రాముడు, సుంకన్న, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా జరిగిన హోలీ పండుగ



విశాలాంధ్ర-హొళగుంద: మండల కేంద్రందలో శనివారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పేట వీధిలో కామన్న విగ్రహాన్ని ప్రతిష్టాపించి కామన్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా పూజలు జరిపి వారం రోజులపాటు వివిధ వేషధారణలతో ప్రజలను రంజింపజేశారు. చివరి రోజున రతి మన్మతులను ఊరేగిస్తూ ఘనంగా పూజలు చేశారు. తప్పెట్లు, రండోల్‌తో యువకులు పురవీధుల్లో కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగును చల్లుకొని హోలీ పండుగను ఆనందంగా జరిపారు. జైశ్రీరామ్ నినాదంతో యువకులు కేరింతలు ఇస్తూ రంగును బంధుమిత్రులపై చల్లారు. హోలీ ఆటల్లో యువకులు వేణు, మల్లికార్జున, ప్రశాంత్, శివకుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు. కామన్న ఉత్సవాలు చివరి రోజున రాత్రి తెల్ల ఏనుగు, నల్ల ఏనుగు, మజ్జిగ బండిలను వీధుల్లో ఊరేగించారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - కోడుమూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యం లో ఈనెల 17నుంచి జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఉపయోగపడే పరీక్షల ప్యాడ్, పెన్సిల్, రెండు పెన్నులు, ఎరేజర్, స్కేల్ వంటి కిట్లను పంపిణీ చేశారు. కోడుమూరు లోని కేజీబీవీ, బీసీ, ఎస్సీ బాలికల వసతిగృహలలో వంద మంది విద్యారినీలకు పరీక్షల సామాగ్రి కిట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎస్టియు మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, చిన్న హనుమంతు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి రంగస్వామిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మహిళ వంటింటికే పరిమితం కాదు అనుకుంటే దేన్నైనా సాధించగలరు. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే తనకు చిన్న వయసులోనే వారి తల్లిదండ్రులు పెళ్లి చేశారన్నారు. ఆనాడు తను విద్యకు దూరమైతున్న సందర్భం, బాల్యవివాహాలు ఎక్కువ జరుగుతున్నాయని తనలాగా ఏ మహిళ ఇలాంటి సమస్యలు ఎదుర్కోకూడదని తన భర్త సహకారంతో పాఠశాలను నిర్మించి ప్రతి ఇంటింటికి తిరిగి ప్రతి పల్లెలో పాఠశాలలను నిర్మిస్తూ అక్షరాభ్యాసతకు దగ్గర చేసిన వీర మహిళ సావిత్రిబాయి పూలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు వెంకటేష్, జాన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరంజినేయులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.
ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	దస్తగిరి దూదేకుల, దస్తగిరమ్మ డి HL000000010274	10- అక్టోబరు-24 09-అక్టోబరు-24 నాటికి రూ.1657249	డి.నం:28/850/జి-ఎ, సర్వే నం:408/1, విశ్వనగర్, నూనెపల్లె గ్రామం, నంద్యాల, కర్నూలు గాయత్రి గుడి దగ్గర, కర్నూలు, నంద్యాల. ఆంధ్రప్రదేశ్-518502. కొలత: 98.74 చదరపు గజాలు. ఉత్తరం: ఇతరుల స్థలం, దక్షిణం: రోడ్డు, తూర్పు: ఇతరుల స్థలం, పడమర: పి.లక్ష్మీనారాయణ యొక్క స్థలం.	లాంఛనప్రాయ స్వాధీనత స్వాధీనత తేదీ: 11-మార్చి -2025

తేదీ: 16.03.2025
ప్రదేశము: కర్నూలు
అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 16, మార్చి 2025

నంద్యాలలో నూతన విష్ణా ఆసుపత్రి ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పద్మావతినగర్ మెయిన్ రోడ్డులో ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్సల నిపుణులు డాక్టర్ జొన్న లగడ్డ వికాస్, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ కృష్ణ సాహితిల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విష్ణా ఆసుపత్రిని శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ప్రధాన భవనాన్ని డాక్టర్ వికాస్ తండ్రి బద్రి నారాయణ ప్రారంభించగా, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ వసుధ రాణి, మహిళా వైద్య విభాగం డాక్టర్ లక్ష్మి సౌజన్య, డాక్టర్ నర్మద, డాక్టర్ నాగమణి, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ లక్ష్మయ్య, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ మురళి, డాక్టర్ జగన్, ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఓపిడి, స్పెషల్ రూమ్స్ విభాగం, జనరల్ వార్డు, ఎమర్జెన్సీ చికిత్స విభాగం, లేబరేటరీ, ఎక్సరే విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక వసతులతో ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్సల విభాగం, నేత్ర చికిత్సల విభాగం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ జొన్నలగడ్డ వికాస్, డాక్టర్ కృష్ణ సాహితి వివిధ ఆస్పత్రులలో పనిచేసి నైపుణ్యం గడించారని, ఆ అనుభవంతో నూతన ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు నంద్యాల ప్రాంత ప్రజలకు అందుబాటు వ్యయంలో అందించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి : ప్రిన్సిపల్ సెక్రటరీ

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని జిల్లా ఇన్చార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరం లోని కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఇన్చార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రిందట మన ఇంటికి పెద్దవారు వచ్చినప్పుడు గొడుగు, చేతి సంచి, ఇత్తడి మరచెంబుతో వచ్చేవారని, ప్రస్తుత కాలంలో అవన్నీ వెళ్లి పోయి, వాటి స్థానంలో ప్లాస్టిక్ ఆక్రమించి, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ నీటి బాటిళ్లు వచ్చాయన్నారు.. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరిస్తూ, ప్లాస్టిక్ కొన్ని వందల సంవత్సరాల తరువాత నిర్వీర్యం కాకుండా అలాగే ఉండిపోతుందన్నారు. ప్లాస్టిక్ అవశేషాలు మనం తినే అన్ని రకాల ఆహార పదార్థాల లో చేరి, చాలా రకాల జబ్బులు వస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్‌ను మన దైనందిక జీవితం నుండి నిషేధించు కోవాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేయాలన్నారు. ప్లాస్టిక్‌ను భూమిపై పడవేయకుండా తిరిగి ఉపయోగించుకునే విధంగా చర్యలు కూడా చేపట్టాలని, మార్కెట్‌కు వెళ్ళినప్పుడు చేతి సంచిని తీసుకుని వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కో అంశంతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ఈ రోజు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించండి, పునర్వినియోగాన్ని ప్రోత్సహించండి అన్న అంశంతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, వార్డులలో నిర్వహించుకుంటు న్నామని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, జీవరాశులకు, ఆరోగ్యానికి చాలా నష్టం కలుగుతుందన్నార..ప్లాస్టిక్ దుష్ప్రభావం సముద్ర జలాలను కూడా

ప్రభావితం చేస్తోందని, ప్లాస్టిక్ వల్ల నేల, నీరు కలుషితం అవుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ దుష్ప్రభావాలు ఆహారంపై కూడా పడడం వల్ల క్యాన్సర్ లాంటి జబ్బులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణాన్ని కాపాడటం మన బాధ్యత అని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సమావేశంలో పాల్గొన్న ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ప్లాస్టిక్ ఫ్రీ భోజన ప్లేట్లు,నేలను శుభ్రం చేసే ప్లాస్టిక్ ఫ్రీ మాప్‌లు తదితర వస్తువుల ప్రదర్శనను తిలకించారు. తదుపరి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో మొక్కలు నాటి, కొండా రెడ్డి బురుజు దగ్గర స్వచ్ఛతా కార్యక్రమం లో పాల్గొని రోడ్లను శుభ్రపరిచారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఈఈ సురేష్, డిటిసి శాంతి కుమారి, ఆర్‌టిఓ బర్షత్ చౌహాన్, హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, సంబంధిత అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినయంతోనే విజయం

విశాలాంధ్ర - పాణ్యం: వినయంతోనే విజయం లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. మండలంలోని విజయానికేతన్ పాఠశాలలో జరుగుతున్న స్కౌట్, గైడ్ల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు చిన్నప్పటినుండి క్రమశిక్షణ అలవడితే అది వారి ఉన్నత భవిష్యత్తుకు దారితీస్తుందని పాఠశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి అన్నారు. స్కౌట్లు, గైడ్లు రకరకాలుగా తమ శక్తి సామర్థ్యాలను అనువైన సమయాలలో ప్రదర్శించాలని అకాడమిక్ ఇంచార్జ్ మురారి వేణుగోపాల్ చెప్పారు. హాస్టల్ ఇంచార్జ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లియో ఆంథోనీ డిస్టిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ రమేష్ నాయక్, డిటిసి కిషోర్ కుమార్ రెడ్డి, రోవర్స్ కార్తీక్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

విశాలాంధ్ర - వెలుగోడు : స్వచ్ఛభారత్ స్వచ్ఛ దివస్ లో భాగంగా వెలుగోడు గ్రామ పంచాయతీలో పరిశుభ్రతపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాసిహల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జయపాల్, మండల స్థాయి అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, ఐకెపి సిబ్బంది, గ్రామపంచాయతీ శానిటేషన్ సిబ్బంది, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

బస్సు ఇంజన్లో పొగలు

విశాలాంధ్ర - చాగలమర్రి: పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న కడప డిపోకు చెందిన బస్సు కర్నూలు నుంచి కడపకు వెలుతుండగా బస్సులో పొగలు వచ్చాయి. భయాందోళన చెందిన డ్రైవరు అప్రమత్తమై టోల్ ప్లాజీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. టోల్ ప్లాజా పారా మెడికల్ సిబ్బంది. బలరామ్ అక్కడికి చేరుకుని ఇంజన్లో వస్తున్న పొగలను గమనించి మంటలు లేయకుండానే వాటిని ఆర్పేశారు. ఓవర్ హీటు వల్ల ఇలా పొగలు వచ్చాయని సిబ్బంది తెలియజేశారు.

ఘనంగా ప్రపంచ వినియోదారుల దినోత్సవం

విశాలాంధ్ర - కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు బొల్లు ప్రసాద్ యాదవ్ అధ్యక్షతన ఘనంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తాను కొన్న వస్తువుకు బిల్లు వినియోగదారునికి శ్రీరామరక్షగా ఉంటుందని బిల్లు లేనిదే అమ్మకపుదారున్ని ఏమి చేయలేమని, అతి సామాన్యుడు నుంచి ఉన్నత స్థాయి వర్గానికి చెందిన వ్యక్తి వరకు ప్రతి వ్యక్తి వినియోగదారుడవుతాడని, తాను కొనబోయే వస్తు సేవల విషయంలో వాటి ప్రమాణం ధర వంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ వస్తువు తయారు తేదీ చివరి తేదీ వంటి విషయాలను తప్పక తెలుసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా వస్తువు గురించిన వివరాలను పరీక్షించడం వాటి గురించి వ్యాపారి చెప్పే విషయాలను వినడం తిరిగి ప్రశ్నించడం ప్రతి వినియోగదారుడు అలవర్చుకోవాలి అని విద్యార్థులకు ఆయన తెలియజేశారు. అలా కానిపక్షంలో ప్రతి వినియోగదారుడు వ్యాపారి చేతిలో దోపిడీకి గురవుతూనే ఉంటాడని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున నాయక్, రవీంద్రబాబు, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్సీరాం జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో శనివారం మంత్రాలయం నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జీ సామేలు అధ్యక్షతన బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్సీరాం 91వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్సీరాం చిత్రపటానికి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాన్సీరాం మార్చి 15/1934న పంజాబ్ రాష్ట్రంలో జన్మించారని తెలిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ పై తిరుగుతూ వ్యాప్తి చేశారన్నారు. పూలే, సాహూ, మహరాజ్, నారాయణ గురు, పెరియార్ మహనీయుల ఆలోచన విధానాన్ని తెలియజేస్తూ బహుజనులకు రాజ్యాధికారం రావాలని ఏప్రిల్ 14/1984న బహుజన్ సమాజ్ పార్టీ ఏర్పాటు చేసి బెహన్ కుమారి మాయవతిని భారతదేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి 1994 లో ముఖ్యమంత్రిని చేసి బహుజనులకు రాజ్యాధికారం ఇచ్చిన మహోన్నతమైన వ్యక్తి కాన్సీరాం అని కొనియాడారు. 1991లో భారతదేశంలో బీసీలకు మండల కమీషన్ పై పోరాటం చేసి బీసీలకు రిజర్వేషన్లు అందించిన మహా దర్శనీయకుడు కాన్సీరాం అన్నారు. ఈ కార్యక్రమంలో శరణప్ప, సంజీవప్ప, దావీదు, నరసన్న, పెద్ద నరసప్ప, రత్నం, చిన్న ఏసు, లాజరు, నరసయ్య, ఆరోను, ప్రకాశం, ఈరన్న, సుధాకర్, సుదర్శనం, రంగన్న, సత్యమ్మ, బజారమ్మ, భీమక్క రంగమ్మ, బొడ్డమ్మ పాల్గొన్నారు.

జీవనానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించి భావితరాలకు భవిష్యత్తు ఇవ్వడమే మన లక్ష్యంగా కావాలని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో ఎంపీడీఓ నాగరాజు స్వామి, ఈఓఆర్డి జయరాముడు ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార

ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్నలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించి భావితరాలకు బంగారు భవిష్యత్తు ఇవ్వడం మనందరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వాడడం అనేక అనర్థాలకు దారి తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజనేయ, విజయ్ కుమార్, అంజి,మొత్రు రామాంజనేయులు, వీరేష్ గౌడ్, ఎంజీ నరసన్న, ముక్కన్న, మునెప్ప, సొంటెన్న, బిపి ఈరన్న, వెంకటరెడ్డి, నరసప్ప, మొత్రు ఈరన్న, మొత్రు నర్సింహులు, లక్ష్మీకాంతరెడ్డి, అయ్యప్ప, మధు, రాముడు, నర్సింహులు, కంబగిరి, రాజు, తిక్కయ్య, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలోని బోయ రేవులలో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, నిషేధంపై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం బోయరేవుల గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీల్, పింగాణి వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ద స్వామన్న, పంచాయతీ సెక్రెటరీ నాగరాజు, సిబ్బంది ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నినాదం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.కృష్ణలు అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో విద్యార్థిని విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ వాడకం తగ్గించుకుందాం ప్రకృతి సంపద రక్షించుకుందాం అని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ ఆధ్యాపకులు విద్యాసాగర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శిరివెళ్ల : ప్లాస్టిక్ రహిత సమాజం మానవ మనుగడకు సోపానమని శిరివెళ్ల మేజర్ పంచా యితీ ఈవో అశ్విని కుమార్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రం లోని ప్రధాన రహదారిపై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ సి శివ మల్లేశ్వరప్ప, సిహెచ్ఓ రామ మోహన్ రెడ్డి ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు విస్మరించాలని ఎంపీడీ శివ మల్లేశ్వరప్ప అన్నారు. ఆర్ డబ్ల్యూ ఎస్ఎఈ సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర, ఉప సర్పంచ్ ఇంతియాజ్ గ్రామ పంచాయతీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు ప్రజా ప్రతినిధులు నిర్వహించి, పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గోనెగండ్ల గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో మణి మంజీరి, టిడిపి మండల నాయకులు బేతాళ బడేసా, ఎస్వీ రామాంజనేయులు హాజరై స్వచ్ఛతపై ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో

సర్పంచ్ పూజారి హైమవతి, వార్డు సభ్యులు అక్బర్, సజ్జలు హసీనా, భారతం హసీనా, ఈఓఆర్‌డి అనంతసేనా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి,పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, టిడిపి నాయకులు అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, షేక్ షావలి, డీలర్ పక్కుర్ ద్దీన్,గౌండ రహుమ్ తుల్లా, సచివాలయ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి నెల మూడో శనివారం లో భాగంగా నిన్న ఉదయం స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేసి అనంతరం ర్యాలీ నిర్వహించి, ఆసుపత్రి ఆవరణ, పలు విభాగాలను పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, డా.శ్రీరాములు, డా.సీతారా మయ్య, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డా.ప్రకాష్, సిఎస్ఆర్ఎం డా.హేమనలిని, ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ హెచ్ఓడి డా.రామ్ శివ నాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల నగాంజన్, ఆసుపత్రి ఏడి మల్లేశ్వరమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛ్ ఆంధ్ర- దివస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మార్క్ షెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి తెలిపారు. శనివారం నంద్యాల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో స్వచ్ఛంద్ర దివాస్ కార్యక్రమాన్ని తులసి రెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతోపాటు అంగన్వాడి కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మన చుట్టూ ఉన్న పరచాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గోపికృష్ణ ప్రజలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలోని ప్రతి షాపు దగ్గరికి వెళ్లి షాప్ యజమానులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంబంధించిన వస్తువులను షాపులలో వాడరాదని వాటిని నిషేధించాలని షాప్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, గ్రామ సర్పంచ్ బాలయ్య, మండల కోఆర్డినేటర్ రాఘవేంద్ర, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డాక్టర్ శబనం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశం లో డాక్టర్ రెడ్డి కిషోర్, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ రాధిక జ్యోతి, డాక్టర్ శబరిస్, ఎంపిహెచ్ఓ దస్తగిరి రెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని నల్లమల అడవిలో గల నంద్యాల గిద్దలూరు రహదారి ప్రక్కన వెలిసినటువంటి శ్రీ సర్వ నరసింహ స్వామి ఆలయ పరిసరాలలో శనివారం ఆలయ అధికారులు సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్మషం లేని హృదయంతో దైవాన్ని ఎలా ప్రార్థిస్తామో, పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత శుభ్రత సైతం భక్తాదులకు అతి ముఖ్యమెందన్నారు.

విశాలాంధ్ర - సి.బెళగల్: ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ రహిత గ్రామాలను నిర్మించాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో రాణెమ్మ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో ప్లాస్టిక్ రహిత గ్రామాలపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్, ఏపిఎం రమేష్ బాబు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలోని 11వ వార్డు పరిధిలో కూరగాయల మార్కెట్లో పరిశుభ్రత పనులను మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుల ఆధ్వర్యంలో చేపట్టారు. 11వ వార్డు కౌన్సిలర్ షఫీ ఉల్లా, కూరగాయల వ్యాపారులు శాలి పైల్వాన్, కూరగాయల బాబు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మన ఆరోగ్యాలను కాపాడుకుందామని ఎంపీపీ శ్రీవిద్య, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో ఈఓఆర్డి జయరాముడు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వారు చెత్త డబ్బాలను పంపిణీ చేశారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - వెలుగోడు: వెలుగోడు మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే పదవతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ తెలిపారు. వెలుగోడు పట్టణంలోని డిపాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోడల్ స్కూల్ నందు పరీక్ష సెంటర్లుగా ఏర్పాటు చేశారు. ఈ మూడు సెంటర్లలో మొత్తం 725 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ సెంటర్లకు సూపరిడెంట్ ఆఫ్ ఎగ్జామినర్లుగా రఫిక్, సత్యనారాయణ హెగ్డే, వెంకటరమణ, డిపార్ట్మెంట్ ఆఫీసర్లుగా పార్థసారధి రెడ్డి, సుబ్బయ్య, నయుంలను నియమించారు. 9:30 నుండి మధ్యాహ్నం 12-45 వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు పరీక్షలకు అరగంట ముందుగా సెంటర్లకు చేరుకోవాలని ఎంఈఓ అన్నారు. ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరిచినట్లు చెప్పారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల నందు ఈ నెల 17 నుంచి జరగబోయే పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సర్వం సిద్ధం చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు తమ జీవితంలో ముందుకు నడిచేందుకు పదో తరగతి మొదటి మెట్టు అని ఆ మెట్టు ఎంత పటిష్టంగా ఉంటే వారు తమ జీవితంలో అంత ఉన్నత స్థాయిలోకి చేరుతారని, విద్యార్థులు ఎటువంటి భయం ఆందోళన లేకుండా ఏకాగ్రతతో చదివి, అత్యున్నత ఉత్తీర్ణశాతం పొంది తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ పరీక్షలు అయిపోయేంత వరకు మొబైల్ ఫోన్‌లను దూరం పెట్టడం ద్వారా ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు.

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: సోమవారం నుంచి జరగబోవు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ చిన్న మదిలేటి తెలిపారు. శనివారం మండలం కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఓ చిన్న మద్దిలేటి మాట్లాడుతూ మండల కేంద్రంలోని రెండు కేంద్రాలలో మొత్తం విద్యార్థులు 430 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. జూపాడు బంగ్లా లోని ఆదర్శ పాఠశాలలో 220, గవర్నమెంట్ హైస్కూల్లో 210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలు నిర్వహించడానికి ఆదర్శ పాఠశాలకు ఎగ్జామ్ చీఫ్‌గా వెంకటేశ్వర్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్‌గా సోమశేఖర్, గవర్నమెంట్ హై స్కూల్‌కు ఎగ్జామ్ చీఫ్‌గా రవికుమార్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా వెంకటేశ్వర్లును ప్రభుత్వం నియమించిందని ఆయన తెలిపారు. పరీక్షలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లను చేసినట్లు ఎంఈఓ చిన్న మద్దిలేటి తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడంపట్ల వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ్ కుమార్ నాయుడు హర్షం వ్యక్తంచేశారు. వర్సిటీ సమీపంలోని సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీ దగ్గర విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి వచ్చిన ఇంటర్ విద్యార్థులు మరియు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల విద్యార్థులకు సేవాగుణం అలవడుతుందన్నారు. భవిష్యత్తులోకూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు బి.కిరణ్ కుమార్, కె.కమలాకర్ రెడ్డి, షేక్ అలిహుసేన్, డి.అబ్దుల్ తదితరులను రిజిస్ట్రార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజి అధ్యాపకులు డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, కె.చిన్నయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ హనీఫ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా డాక్టర్ హనీఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.మన చుట్టూ ఉన్న సమాజానికి మంచి పేరు తేవాలంటే మనం పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం అందించాలని తెలిపారు.అనంతరం ఆసుపత్రి ఆవరణలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనురాధ, నర్సింగ్ సూపరిడెంట్ నాగరాణి, హెడ్ సిస్టర్లు హేమలత, సుధారాణి సిబ్బంది పాల్గొన్నారు.